క్లుప్తంగా

సినీనటుడు ఆలీని కలిసిన ఎమ్మెల్యే వైవీఆర్



ఆలీకి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: ప్రముఖ తెలుగు సినీనటుడు, ఏపీ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు మహ్మద్ ఆలీని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని అలీ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, నైరుతిలు అలీకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి యోగక్షేమాలను ఆరా తీశారు. గడిచిన ఎన్నికల్లో వైవీఆర్ తరపున గుంతకల్లులో ప్రచారం నిర్వహించిన ఆలీని తిరిగి నియోజకవర్గంలో పర్యటించాలని ఎమ్మెల్యే కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

చైన్‌స్నాచర్లపై అప్రమత్తంగా ఉండండి

గార్లదిన్నె: మండల ప్రజలు చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ అస్రార్ బాషా సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో చైన్ స్నాచింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ నిత్యం ప్రజలు దొంగతనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌తో సెబ్ సీఐ, సిబ్బంది

తాడిపత్రి అర్బన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సెబ్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు.. రూరల్ పరిధిలోని కావేటిసముద్రం క్రాస్ వద్ద ఇసుక లోడుతో వెళుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, అవుకు మండలం కొండమనాయుని పల్లికి చెందిన తుపాకుల పవన్ అనే ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోరాటకాలనీకి చెందిన గద్దల శ్రీరాములను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నెట్టికంటుడి సన్నిధిలో నాగార్జునయాదవ్



వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులతో నాగార్జున యాదవ్

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జున యాదవ్ ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామి తీర్థ ప్రసాదాలను ఆయనకు అందజేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ యాదవ్ ఆయన వెంటున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పరిసరాలను శుభ్రం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

గుత్తి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని సత్యసాయి సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని కోట ముఖద్వారం పరిసరాల్లో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పచ్చదనం – పరిశుభ్రత, మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు చీపర్లు చేత పట్టి పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించారు. సమితి అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పార్కింగ్ కష్టాలు!

- పార్కింగ్ జోన్లు లేక వాహనదారుల అవస్థలు
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత



యల్లనూరు రోడ్డులోని ఆశా ఆసుపత్రి వద్ద రహదారిపైనే నిలిపిన వాహనాలు

తాడిపత్రి: పట్టణంలో వాహనాలకు పార్కింగ్ జోన్లు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో వాహనాల రాకపోకలు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారులకు దగ్గరగా స్థలాలున్న పలువురు యజమానులు పార్కింగ్ స్థలం లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన కూడళ్లలో రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలు ఉండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపేయడంతో సామాన్య ప్రజలు ఆ దారి వెంట వెళ్లాలంటేనే జంకుతున్నారు.

తప్పనితిప్పలు..

పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని ఆశా ఆసుపత్రి షాపింగ్ భవనం, నూతన కూరగాయల మార్కెట్ ఎదురుగా ఓ షాపింగ్ మాల్, కృష్ణాపురం జీరో రోడ్డు, పుట్లూరు రోడ్డులో పలు దుకాణాలు, కాంప్లెక్స్‌లు ఉన్నాయి. నిత్యం అవసరాల నిమిత్తం ప్రజలు ఈ దారుల వెంట వెళ్తుంటారు. వస్తు, సామగ్రి కొనుగోలు చేయాల్సిన సమయంలో దుకాణాల ముందు కొనుగోలుదారులు రోడ్డుకు ఇరువైపులా తమ వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజలు ముందుకు వెళ్లలేక, బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడితే ముందు భాగంలో వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలి. అయితే పట్టణంలో ఎక్కడా పార్కింగ్ జోన్లు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

ట్రాఫిక్ అంతరాయం...

మూడు జిల్లాల సరిహద్దు అయిన తాడిపత్రి నుంచి ఇతర ప్రాంతాలకు సైతం బస్సులు, భారీ వాహనాలు, కార్లు పలు కూడళ్లల్లోంచి రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల నుంచ ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. తాడిపత్రి పట్టణంలో దాదాపు అక్కడక్కడ వన్‌వే రహదారులు ఉన్నప్పటికీ ఆయా దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ముందు పార్కింగ్ జోన్లు లేకపోవడంతో అక్కడికి వచ్చే వారు వారి వాహనాలను ప్రధాన రహదారులపై ఉంచుతున్నారు. అదే రహదారిపై బస్సులు, లారీలు, ఇతర వాహనాలు వెళ్లాల్సి రావడంతో ఆయా రహదారులు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

చర్యలు తీసుకుంటాం



పార్కింగ్ జోన్లు లేకుండా పట్టణంలో పలు దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– సీఎం గంగయ్య, డీఎస్పీ

బండారూ.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిపై నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజాపై బండారు సభ్య సమాజం సిగ్గుపడేలా, తలదించుకునేలా మాట్లాడారన్నారు. అలాంటి వ్యక్తిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నుంచి బండారును సస్పెండ్ చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తూ ముందుకు నడిపిస్తుంటే టీడీపీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. టీడీపీలో మహిళలకు ఎంత మాత్రం గౌరవం లేదనడానికి ఆర్‌కె రోజాపై బండారు చేసిన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. టీడీపీ నేతల నోళ్లకు కళ్లెం వేయకుంటే సమాజంలో మహిళలకు గౌరవం లేకుండా పోతుందన్నారు. వెంటనే బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సినిమా రంగానికి చెందిన అతిరథ మహారథులందరూ ఆర్‌కె రోజాకు మద్దతుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాశీరావు, వైఎస్సార్ సీపీ నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు, గురుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ ద్వారా సాగునీరందిస్తాం



గుత్తి మండలం మాముడూరు వద్ద హెచ్ఎల్సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు, యాడికి మండలాల రైతులకు హెచ్ఎల్సీ ద్వారా సాగు అందించడానికి కృషి చేస్తామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన గుత్తి మండలం మాముడూరు వద్ద హెచ్చెల్సీ కాలువను పరిశీలించారు. మాముడూరు చెరువు నుంచి వచ్చే నీటిని హెచ్ఎల్సీ ద్వారా పెద్దవడుగూరు మండలానికి మళ్లించడానికి ఎలాంటి పనులు చేపట్టాలో హెచ్ఎల్సీ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈనెల 15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నవరాత్రులను పురస్కరించుకుని తమిళనాడులోని సేలం, కోలార్, నరసరావుపేటకు చెందిన కళాకారులు ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారన్నారు. 15న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు రాత్రి కన్యాక పరమేశ్వరి మాత రాజరాజేశ్వరీదేవి రూపంలో దర్శనమిస్తారని తెలిపారు. 16న గాయత్రీదేవి, 17న కామాక్షిదేవి, 18న గజలక్ష్మీదేవి, 19న అన్నపూర్ణదేవి, 20న సరస్వతీదేవి, 21న అష్టలక్ష్మీదేవి, 22న మహిషాసురమర్దినిదేవి అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 23వ తేదీ అమ్మవారి గుండ ప్రవేశం, సాయంత్రం వాసవీమాత రథోత్సవం ఉంటుందని వివరించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

గుంతకల్లుటౌన్: సురక్షిత ప్రయాణానికి చిరునామాగా నిలిచిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆకర్షణీయమైన బహుమతులు పొందాలని గుంతకల్లు డీఎం నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు–ఆదోని రూట్లల్లో తిరిగే 9 సర్వీసుల్లో ఈ నెలాఖరు వరకు ప్రయాణించిన వారు తమ టిక్కెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని పేర్కొన్నారు. 15 రోజులకోసారి లక్కీ డ్రా తీసి మొదటి ముగ్గురు విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను అందజేయనున్నట్లుతెలియజేశారు.

గుత్తి: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ ప్రవేశపెట్టినట్లు డీఎం నారాయణ స్వామి, ఎస్టీఐ రమణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తి – అనంతపురం బస్సుల్లో ప్రయాణించే వారు ప్రతి నెలా 1–15 తేదీ వరకు తిరిగి 16–30 వరకు టికెట్లకు వెనుక పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలని పేర్కొన్నారు. ప్రతి నెలా రెండు సార్లు డ్రా తీసి తొలి ముగ్గురికి బహుమతులు ఇస్తామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య



మృతురాలు శీలా

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్ రోడ్డులో నివాసముంటున్న ఓ మహిళ అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వివరాల మేరకు..ఎస్‌జేపీ హైస్కూల్ రోడ్డులో నివాసముంటున్న శీలా(59) ఆనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె భర్త దేవప్రసాద్ ప్రార్థనా మందిరానికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. కాగా శీలా,ప్రసాద్ దంపతులకు ఉన్న ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నట్లు సమాచారం.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రంగారావు ఆదివారం తెలిపారు. ప్రత్యేక వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అంజేస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శింగనమల:బుక్కరాయసముద్రం మండలం బుక్కరాయసముద్రం-4, గార్లదిన్నె మండలం కల్లూరు-3, పుట్లూరు మండలం శనగలగూడురు సచివాలయాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

కార్తీక ఉత్సవాల నిర్వహణకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ శైవ క్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయంలో నవంబర్ 14 నుంచి కార్తీక ఉత్సవాల నిర్వహణలో భాగంగా వివిధ రకాల పనులకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ కృష్ణయ్య ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో క్యూలైన్ల ఏర్పాటు, షామియానాల, ప్రింటింగ్ మెటీరియల్ సప్లయ్, సున్నం పూతలు, నిత్యాన్నదానం కోసం కిరాణా సరుకులు, కూరగాయల సరఫరా, వంట మాస్టర్, సప్లయర్స్, భోజనశాలలో ఇనుప జాలరీ, ఆలయ అద్దె గదుల ముందు మెట్ల ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 16వ తేదీ లోపు ఆలయ ఈఓ కార్యాలయంలో కొటేషన్లు అందజేయాలని ఈఓ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఎద్దులకు తీవ్రగాయాలు

గార్లదిన్నె: యర్రగుంట్లలో ఆదివారం జరిగినరోడ్డు ప్రమాదంలో రెండు ఎద్దు లు తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని కొప్పలకొండకు చెందిన ఓబిలేసు అనే రైతు ఎద్దుల బండిలో యర్రగుంట్ల నుంచి కొప్పలకొండకు వెళ్తుండగా ఎదురుగా ఐచర్‌వాహనం వచ్చి ఎద్దుల బండిని ఢీకొంది. ఘటనలో రెండు ఎద్దుల తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్య సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకొని ఎద్దులకు వైద్యం అందించారు. అనంతరం బాధిత రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు నిఖిల్ నాయక్

గార్లదిన్నె: మండలంలోని ఓబులాపురం కొట్టాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శింగనమల మండలం నాగుల గుడ్డం తండాకు చెందిన నిఖిల్ నాయక్(22) బైక్‌పై గార్లదిన్నె నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ఓబులాపురం కొట్టాల సమీపంలోని రంగు ఫ్యాక్టరీ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. ఇద్దరికి గాయాలు

కంబదూరు: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఆదివారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో ఒకరు గాయపడ్డారు.వివరాలు ఇలా ఉన్నాయి..కళ్యాణదుర్గం మండలం ఈస్ట్‌కోడిపల్లి గ్రామానికి చెందిన హనుమంతరాయుడు ఆటోలో పావగడకు వెళ్తుండగా.. కంబదూరు చెరువు కట్ట కింద ఉన్న క్రాస్ వద్ద ఆటో అదుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో హనుమంతరాయుడు తల, ఎడమకాలికి బలమైన గాయాలు తగిలి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపాన ఆదివారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలు మేరకు.. వెంకటరమణ ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వెళ్తుండగా అదుపు తప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కింద పడ్డాడు. గాయపడ్డ అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిమార్గంతోనే ఉన్నత జీవితం

- త్రిదండి సంపత్కుమార జీయర్ స్వామీజీ

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతోనే ఉత్తమ గతులు, ఉన్నత జీవితం ప్రాప్తిస్తాయని త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఉద్బోధించారు. స్వామీజీ దేశవ్యాప్తంగా హైందవ మత ప్రచార యజ్ఞంలో పాల్గొంటూ ఆదివారం అనంతకు చేరుకున్నారు. స్వామీజీ స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రవచనం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: లచ్చానుపల్లిలో ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు కొన్ని నెలలుగా ఆర్థిక సమస్యలతో పాటుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకు దింపి గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మ సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

గుత్తి: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం కమ్మ సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా దబ్బర చిన్న వెంకటనాయుడు, గౌరవాధ్యక్షుడిగా గోరంట్ల నాగరాజు(అలియాస్ బోర్‌వెల్ నాగరాజు), ఉపాధ్యక్షుడిగా గూడూరు నారాయణ స్వామి, ప్రధాన కార్యదర్శిగా కోనంకి కృష్ణ, సహాయ కార్యదర్శిగా మల్లికార్జుననాయుడు (లాయర్), కోశాధికారిగా మచ్చా రంగ స్వామి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.

20న వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్లూరు: ఈ నెల 20న తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు సర్కిల్ వద్ద వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు వెంకటేష్, ఆదినారాయణ, శ్రీరాములు, దొడ్లో హనుమంతు, బ్రహ్మయ్య, నారాయణస్వామి, ఓబుళేసు, శివ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపుల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

యాడికి: డ్రిప్ పైపుల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్‌ఐ వివరాలు వెల్లడించారు. రాయలచెరువు గ్రామంలో సరస్వతీ పైపుల షాపు బయట ఉన్న 1.5 టన్నుల డ్రిప్ పైపులు శనివారం చోరీకి గురయ్యాయి. షాపు యజమాని భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం రాయల చెరువు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు హరికృష్ణ డ్రిప్ పైపులను గుత్తికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు హరికృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బైక్‌పై నుంచి పడిఓ ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పట్టణంలోని బెస్త గేరికి చెందిన నరసింహులు తన వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గుంతకల్లుకు బయలుదేరాడు. కొజ్జేపల్లి గ్రామ క్రాస్ వద్ద వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరసింహులును 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సర్పరూపుడికి విశేష పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. ఆదివారం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్యం – ప్రభుత్వ బాధ్యత అనే అంశంపై ఉమ్మడి ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం



పుల్లారెడ్డి(ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని రేగడి కొత్తూరు గ్రామంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడ్డిరెడ్డి పుల్లారెడ్డి(46) గత నెల 16న బాట్లో సుంకులమ్మ ఆలయానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంత వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుల్లారెడ్డి ఆచూకీ తెలిస్తే సీఐ -9440796816, ఎస్ఐ-9392918291 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అరటిగెలల నరికివేత

పెద్దపప్పూరు: ముచ్చుకోటలో ఆదివారం బాబా అనే రైతు అరటితోటలో 18 గెలలను నరికివేశారు. వివరాలు.. రైతు ఆదివారం ఉదయం పొలానికి వెళ్లగా అరటి గెలలు నరికివేసిన విషయం తెలిసింది. దీనిపై రైతు చుట్టుపక్కల వారిని ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని కుళ్లాయప్ప నరికేసినట్లు తేలింది.

వైద్యం కోసం ఆర్థికసాయం

పామిడి: స్థానిక సంతమార్కెట్‌వీధికి చెందిన మానసిక వ్యాధిగ్రస్తురాలు సోనూ వైద్యం కోసం ఆదివారం పామిడి యువత తమవంతుగా ఆర్థికసాయం చేశారు. ఆమె వైద్యానికి రూ.లక్ష దాకా ఖర్చు అవుతుందన్న సమాచారం తెలుసుకున్న యువత చందాలతో డబ్బు జమ చేశారు. అలా పోగుచేసిన రూ.11,710ను ఆదివారం బాధితురాలి కుటుంబసభ్యులకు అందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ఓబుళయ్య(76) చికిత్స పొందుతూ అనంతపురంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓబుళయ్య అనే వృద్ధుడు వయోభారంతో పాటుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు అయన్ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం వేకువజామున మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవ ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం దివ్యాంగుల దినోత్సవ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీవీ మోహన్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల దేవుడు కలిగిన దయ, కరుణ అందరం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో దివ్యాంగులు సకలాంగులకు ఏమాత్రం తీసిపోవడం లేదన్నారు. దివ్యాంగులను ఆదరించి దేవుని కృపను పొందాలన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, అబ్రహాం, జయరాజు, అరుణ్, ప్రసాద్, రజని, మంజుల, శాంతమ్మ, చంద్రకళ, రేచెల్, మహిమ, వాణి, కీర్తిమణి తదితరులు పాల్గొన్నారు.